www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 28 ఏప్రిల్ 2023

## కలెక్టరేట్‌లో 'ఆక్టోపస్' మాక్‌డ్రిల్

**ప్రజాశక్తి - ఏలూరు**

తీవ్రవాదుల దాడులు, విపత్తు సమయంలో ప్రాణరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం రాత్రి తీవ్రవాదుల దాడులు, విపత్తు సమయంలో రక్షణ విధానంపై పోలీస్ శాఖకు చెందిన 'ఆక్టోపస్' విభాగం సిబ్బంది, వివిధ విపత్తు నివారణ శాఖల సిబ్బందితో 'మాక్ డ్రిల్' నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆక్టోపస్ విభాగం ఎస్‌పి నాగేంద్రరావు మాట్లాడుతూ టెర్రరిస్టుల ఏరివేత, బాంబుల నిర్వీర్యం చేయడం చర్యలు 'ఆక్టోపస్' బలగాలు చేపడతాయన్నారు. 'మాక్‌డ్రిల్'లో ఒక వ్యక్తిని టెర్రరిస్టులు కిడ్నాప్ చేసిన సమయంలో ఆ వ్యక్తిని రక్షించడం, టెర్రరిస్టులను రూపుమాపడం, బాంబులను నిర్వీర్యం చేయడం వంటి అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఆక్టోపస్ అదనపు ఎస్‌పి నగేష్‌బాబు, డిఎస్‌పి కృష్ణారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# కలుషిత ఆహారం తిని 17 మందికి అస్వస్థత

### 13 మంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలింపు



వైద్యులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ పెంచల్‌కిషోర్

**ప్రజాశక్తి - దెందులూరు**

కలుషిత ఆహారం తిని మండలంలోని కొత్తగూడెం పంచాయతీ శింగవరం పరిధిలోని యానాదిపేటకు చెందిన 17 మంది అస్వస్థతకు గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, వైద్య శాఖాధికారులు, తహశీల్దార్ ఎన్‌వి.నాంచారయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి గుండుగొలనులో జరిగిన ఒక ఫంక్షన్‌లో మిగిలిపోయిన ఆహార పదార్థాలను గురువారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో యానాదిపేటకు చెందిన పలువురు తెచ్చుకుని తిన్నారు. వాటిలో మటన్ బిర్యానీ కూడా ఉంది. దానిని భుజించిన పలువురు మధ్యాహ్న సమయానికి అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వాంతులు, విరోచనలు కావడంతో స్థానిక ఆశావర్కర్లు, వాలంటీర్లు స్పందించి వైద్యులకు సమాచారం అందించారు. అయితే వీరిలో 13 మంది తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో 108 వాహనం, ప్రయివేటు వాహనాల్లో హుటాహుటీన ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పదేళ్లలోపు చిన్న పిల్లలు పది మంది ఉన్నారు. మరొకరు గర్భిణి. వారికి ఏలూరులో సకాలంలో చికిత్స అందించటంతో ఎటువంటి ప్రాణాపాయం లేకుండాపోయిందని వైద్యులు తెలిపారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. ఏలూరు ఆర్‌డిఒ పెంచల కిషోర్‌కుమార్ అక్కడికి చేరుకుని వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితులంతా యానాదులు, గుండుగొలను పరిసర ప్రాంతాల్లో ఏ ఫంక్షన్ జరిగినా యానాదిపేటకు చెందిన వారు ఆకులు తీసే పనికి వెళ్లి మిగిలిన ఆహార పదార్థాలు తెచ్చుకుంటుంటారు.

యానాదిపేటలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

**అప్రమత్తమైన వైద్యఆరోగ్య శాఖ**

వైద్య ఆరోగ్య శాఖ వెంటనే స్పందించి మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. పోతునూరు పిహెచ్‌సి వైద్యులు గ్రామానికి చేరుకుని బాధితులకు మందులు అందించారు. తహశీల్దార్ నాంచారయ్య ఇంటింటికీ వెళ్లి ఇంకా ఎవరైనా బాధితులున్నారేమోనని ఆరా తీశారు.

# జిల్లాకు చేరిన సాయిష్ భౌతికకాయం

### నేడు పాలకొల్లులో అంత్యక్రియలు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, స్పోర్ట్స్**

ఈ నెల 20న అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థి వీరా సాయిష్ మృతదేహం గురువారం సాయంత్రం ఏలూరు చేరుకుంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన సాయిష్ అమెరికాలోని ఓహియో రాష్ట్రంలోని క్లీన్‌ల్యాండ్ యూనివర్శిటీలో ఎంఎస్ చదువుతూ ఉపాధి కోసం గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో చేరారు. ఈ నెల 20న ఫిల్లింగ్ స్టేషన్‌లో దోపిడీకి వచ్చిన దుండగుడు జరిపిన కాల్పుల్లో సాయిష్ అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు జోక్యం, ప్రభుత్వ చొరవతో అన్ని లాంఛనాలు పూర్తి త్వరితగతిన పూర్తి చేయడంతో సాయిష్ మృతదేహం గురువారం ఉదయం హైదరాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్‌లో గురువారం సాయంత్రానికి ఏలూరు అశోక్‌నగర్‌లోని స్వగృహానికి తరలించారు. తల్లి జయశ్రీ రోదించిన తీరు అక్కడ అందర్నీ కంటతడి పెట్టించింది. చింటూ చింటూ అంటూ ఆమె గుండె పగిలేలా రోదిస్తుంటే ఆ ప్రాంతమంతా తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సోదరుడు వెంకటేష్, బంధువుల ఆక్రందనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. ఇకెవరికి తమ పిల్లలను అమెరికా పంపొద్దు అంటూ ఆ తల్లి రోదించడం చర్చనీయాంశమైంది. అనంతరం సాయిష్ భౌతికకాయాన్ని అతని తండ్రి స్వగ్రామమైన పాలకొల్లు తరలించారు. శుక్రవారం ఉదయం పాలకొల్లులో సాయిష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ప్రభుత్వం తరుపున ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్ అన్ని ఏర్పాటును పర్యవేక్షించారు. ఏలూరు మాజీ ఎంపి మాగంటి వెంకటేశ్వరరావు, ఉద్యోగ సంఘ నాయకులు హరినాథ్, చోడగిరి శ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాయిష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

# సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

### సచివాలయ ఉద్యోగుల బదిలీలపై సిఎంకు వివరిస్తా
### ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

దేశంలో ఎక్కడా లేనివిధంగా నవరత్నాల పేరిట ప్రభుత్వం వినూత్న సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులకు అందించడంలో సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమని పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి (పిఆర్అండ్ ఆర్‌డి) రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. ఆయన గురువారం మండలంలో పర్యటించారు. తొలుత తిమ్మయ్యపాలెంలో ఉపాధి కూలీలు చేస్తున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. కుటుంబానికి వంద రోజులు పనిదినాలు సరిపోవడం లేదని, పెంచాలని కూలీలు కోరారు. ఎండాకాలంలో పని సమయాన్ని తగ్గించాలని, మజ్జిగ, నీడనిచ్చే టెంట్ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కంసాలికుంటలో చెరువు పనులను పరిశీలించారు. చేబ్రోలు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్గత రహదారులు, మౌలిక సదుపాయాల కోసం సిఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం చేబ్రోలు-2 సచివాలయంలో ఉద్యోగులతో ముఖాముఖి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో మీ పాత్ర కీలకమని, అదే సమయంలో ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రొబేషన్ పూర్తయిన సచివాలయ ఉద్యోగులందరికీ సాధారణ బదిలీలు అవకాశం కల్పించేలా ప్రభుత్వానికి సూచిస్తానని నాగార్జునరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావుతో కలిసి మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలు, సాంకేతిక ఇబ్బందులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా పీడీ ఎ.రాము, ఆ శాఖ జిల్లా విజిలెన్స్ అధికారి ఎవి.విజయలక్ష్మి, డిఎల్‌డిఒ జి.రమణ, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఆంజనేయులు, ఇఒపిఆర్‌డి షేక్ షంషుద్దీన్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ మంగారావు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

# యువతకు సేవలందించేందుకు ప్రత్యేక కార్యక్రమం

### యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి

**ప్రజాశక్తి - భీమడోలు**

యువజన సంఘాలను నూతన షరతుల మేరకు పునరుద్ధరించి వాటి ద్వారా యువతకు సేవలందించేందుకు యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తుందని యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుర్తింపు పొందిన యువజన సంఘాలకు సర్టిఫికెట్ల పంపిణీ, విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి హెచ్.మెహర్రాజ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ గతంలో సహకార శాఖ ద్వారా నమోదైన యువజన సంఘాలు యువజనులకు ప్రభుత్వం తరపున సేవలందించేవన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం యువజన సంఘాల పనితీరును మరింతగా మెరుగుపర్చేందుకు, సమర్థవంతంగా పనిచేసేందుకుగాను యువజన సంఘాల నమోదును సరళీకృతం చేసిందన్నారు. దీనిలో భాగంగా యువజన సంఘాలు సెట్‌వెల్ ద్వారా గుర్తింపు పొందాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులైన పది మందికి తక్కువకాని సంఖ్యలో సభ్యులు ఒక సంఘంగా ఏర్పడవచ్చన్నారు. వీరు తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకూ చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారికి విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి అవసరమైన సమాచారాన్ని, సాహిత్యాన్ని పుస్తకాల రూపంలో వారికి అందుబాటులో ఉంచామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జిల్లాస్థాయిలో శిక్షణిచ్చే కొన్ని సంస్థల వివరాలను వాటిలో పొందుపర్చామన్నారు. ఇంతవరకు 500 సంఘాలకు గుర్తింపు పత్రాలు అందజేశామన్నారు. భీమడోలులో ఇంతవరకు ఈ తరహాలో గుర్తింపు పొందిన ఐదు సంఘాలకు సర్టిఫికెట్లను అందజేశామన్నారు. వివిధ అంశాల్లో నిపుణులు వీరికి శిక్షణిస్తారని తెలిపారు. సెట్‌వెల్ సిఇఒ మెహర్రాజ్ మాట్లాడుతూ మండల పరిధిలో 17 గ్రామ సచివాలయాలు ఉండగా కేవలం ఐదు సచివాలయాల నుంచి మాత్రమే ఒక్కో సంఘం చొప్పున నమోదు జరిగిందన్నారు. చైతన్య యువజన సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.మాన్‌సింగ్ మాట్లాడుతూ భీమడోలులో గంజాయి విస్తృతంగా అందుబాటులోకి రావడం ఆందోళన కల్గిస్తుందన్నారు. దీన్ని అరికట్టేందుకు యువజన సంఘాలు (యూత్ క్లబ్)లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సెట్‌వెల్ ఎఒ కెనడి, మేనేజర్ పివిఎస్ఎం.సత్యనారాయణ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ పట్టాభిరామ్, భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న శారదాదేవి

# రిటైర్డ్ ఉద్యోగులకు నేతల పరామర్శ

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఎపి జెఎసి అమరావతి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా 'రిటైర్డ్ ఉద్యోగుల పరామర్శ యాత్ర' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏలూరు మండలంలో రిటైర్డ్ ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. గ్జేవిఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ టీచర్ సిహెచ్.సుందరరావును, విద్యానగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఎ.రామకృష్ణను కలిసి పరామర్శించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఎపి జెఎసి అమరావతి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో ప్రతినెలా 15 వేల మంది పెన్షనర్లు ఒకటో తేదిన పెన్షన్ అందకపోవడం వల్ల మందుల కొనుగోలుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హెల్త్‌కార్డుపైనా వైద్యం అందడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగులో ఉన్న మూడు డిఎలు మంజూరు చేయాలరని, డిఎ,. పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.ప్రమోద్‌కుమార్, పంచాయతీరాజ్ ఉద్యోగుల జిల్లా కార్యదర్శి ఆర్.వీరబాబు, కోశాధికారి ఆర్.శ్రీకాంత్, ఎపి జెఎసి అమరావతి కోఛైర్మన్ సిహెచ్.వర్మ పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగితో మాట్లాడుతున్న రమేష్‌కుమార్, నేతలు

ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న మనోహర్

# తాగునీటి సరఫరా అభినందనీయం

### జనసేన నేత నాదెండ్ల మనోహర్

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తి తీర్చేలా తాగునీరు సరఫరా చేయడం అభినందనీయమని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం పట్టణంలో వివిధ కార్యక్రమాలకు హాజరైన తర్వాత జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శ్రీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్ పత్సమట్ల ధర్మరాజు ఏర్పాటు చేసిన ఉచిత తాగునీటి సరఫరా ట్యాంకర్లను మనోహర్ పూజా కార్యక్రమాలు నిర్వహించి జెండాఊపి ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఆలోచనలను ధర్మరాజు పాటిస్తూ గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, రాష్ట్ర కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# వైసిపి హయాంలో జైళ్లశాఖలో సంస్కరణలు

### హోం శాఖా మంత్రి తానేటి వనిత

**ప్రజాశక్తి - పోలవరం**

వైసిపి ప్రభుత్వ పాలనలో జైళ్ల శాఖలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పలు సంస్కరణలు తీసుకొచ్చారని హోం శాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన హిందుస్థాన్ పెట్రోలియం బంకును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగిన నేరస్తులతో ఈ బంకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు కారణాల రీత్యా జైలుకు వచ్చిన ఖైదీల్లో మానసిక పరివర్తన కల్గించేందుకు జైళ్లలో యోగా తరగతులు నిర్వహిస్తున్నామని, ప్రత్యేక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, వారి ద్వారా వచ్చే ఆదాయాన్ని జీతాలుగా వారి కుటుంబానికి అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఝాన్సీరాణి, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్లు కె.రమేష్ ప్రసాద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షనకు ప్రత్యేక చర్యలు : ఎస్‌పి

**ప్రజాశక్తి - చింతలపూడి**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి తెలిపారు. ఆమె గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలోని పోలీస్ స్టేషన్లను పరిశీలిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎంవిఎస్.మల్లేశ్వరరావు, ఎస్ఐ డి.హరికృష్ణ పాల్గొన్నారు.

**టి.నరసాపురం:** అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతి అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోని పోలీసు స్టేషన్లను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా కోడిపందేలు, పేకాట వంటి జూద క్రీడలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు ప్రాధాన్యతివ్వాలని తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.సతీష్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ముసునూరు:** వేసవిలో పేకాట, కోడిపందేలు, దొంగతనాలు అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్‌పి మేరీప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె వెంట నూజివీడు డిఎస్‌పి అశోక్‌కుమార్‌గౌడ, ఎస్ఐ ఎం.కుటుంబరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడిలో ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మహిళా పోలీసులు

# సిపిఎం నాయకులు ఏసుదాసు మృతి

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పరిమి ఏసుదాసు బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, పట్టణ కార్యదర్శి ఎన్ఆర్.హనుమానులు, నాయకులు వై.దుర్గారావు, ఎకెడి.ప్రసాద్, పి.శోభనాద్రి, పి.కమల, ఎన్.పద్మాంజలి సందర్శించి నివాళులర్పించారు. భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ ఏసుదాసు మృతి సిపిఎంకు తీరనిలోటన్నారు. ప్రజాతంత్ర ఉద్యమాల్లో ఏసుదాసు చురుగ్గా పని చేసేవారని కొనియాడారు. అనంతరం ఏసుదాసు అంత్యక్రియలు నిర్వహించారు.

నివాళులర్పిస్తున్న నేతలు

# ధర లేక జీడిమామిడి రైతులకు నష్టాలు

### పిక్కల బస్తాకు రూ.16 వేలు ధర ప్రకటించాలి
### ఆర్‌బికెల ద్వారా జీడిపంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి
### ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

గిట్టుబాటు ధర లేక జీడిమామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 80 కిలోల బస్తా జీడి పిక్కలకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో 'జీడిమామిడి పంటకు మద్దతు ధర-ప్రభుత్వం కొనుగోలు అంశం'పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వరి, చెరకు, పత్తి తదితర అనేక పంటలకు మద్దతు ధర ప్రకటిస్తుందని, ప్రతి సంవత్సరం ఎంతోకొంత ధర పెరుగుతూ ఉంటుందని అన్నారు. జీడిమామిడి పంటకు మాత్రం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. రైతుల వద్ద జీడిపిక్కలు ఉన్నప్పుడు వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తారని, వ్యాపారుల చేతికి సరుకు చేరిన తర్వాత అమాంతంగా జీడి ధర పెరిగిపోతోందని వివరించారు. ఉత్పత్తి ఖర్చులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పిక్కల ధర నిర్ణయంలో ఎటువంటి శాస్త్రీయత పాటించక వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం జీడిపిక్కల ధర బస్తా రూ.8 వేలు మాత్రమే ఇస్తున్నారని, దీనివల్ల జీడిమామిడి రైతులు వ్యాపారుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని అన్నారు. జీడిపప్పు బస్తా (80 కిలోలు) పిక్కలకు 22 కేజీలు పప్పు వస్తుందని, మరో మూడు కేజీలు ముక్కలు, తొక్కలు బస్తాకు 50 కేజీలు వస్తాయన్నారు. వీటి ద్వారా ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం సుమారుగా బస్తాకు రూ.19,400 ఆదాయం వస్తుందని, ప్రాసెసింగ్ ఖర్చు బస్తాకు రూ.రెండు వేలు అవుతుందని, రైతుకు బస్తా (80 కిలోలు)కు రూ.16 వేలు ఇచ్చినా మొత్తం రూ.18 వేలు ఖర్చుపోగా బస్తా వద్ద రూ.1400 మిగులు ఉంటుందని చెప్పారు. జీడిమామిడి రైతులకు న్యాయమైన ధర చెల్లించి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. జీడి పంట విస్తరణకు, నిర్వహణకు గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలన్నారు. జీడిపిక్కలు ఆరబెట్టుకునేందుకు టార్ఫాలిన్లు ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జీడిమామిడి రైతు మాండ్రు సూర్యచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు అందుగుల ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

## సిఐటియు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి- నూజివీడు రూరల్**

మేడే కార్మిక దినోత్సవంలో భాగంగా కార్మిక జెండా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో సిపిఎం నాయకులు గురువారం సిఐటియు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నూజివీడు మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ మేడే సందర్భంగా కార్మిక, కర్షక, కష్టజీవులు ఐక్యంగా నిలిచి మేడే స్ఫూర్తి నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మహేష్, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

**ఏలూరు టౌన్ :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను మే ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక దినంగా జరపాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు ఉద్యోగ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. వాడవాడలా మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కార్మిక ప్రదేశాల్లో తోరణాలతో అలంకరించి పతాకాల ఆవిష్కరణ చేసి సభలు, సమావేశాలు జరపాలని బండి వెంకటేశ్వరరావు కార్మిక వర్గాన్ని కోరారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**ప్రజాశక్తి - చాట్రాయి**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అయార్ల జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు అన్నారు. మండల కేంద్రమైన ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించి ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నీర్వర్యం చేసే విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తున్న ప్రభుత్వాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ సభ్యులు భూతం మారయ్య, చింతలపూడి మండల కమిటీ సభ్యురాలు బొలమాల సీతామహాలక్ష్మి, కోటపాడు ఏరియా కమిటీ కార్యదర్శి హెచ్.రాజేంద్రప్రసాద్, ఆనందరావు, ఎస్‌కె.బాజీ, కమల్, పుల్లమ్మ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్‌లు ఇవ్వాలి

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు పే స్లిప్పులు ఎప్పటికప్పుడు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రోజు కూలి ఎంత పడుతుందో తెలిపే ప్లే స్లిప్పులు ఇవ్వకుండా పనులు చేయించడం దుర్మార్గమన్నారు. వేతన బకాయిలు చెల్లించాలని, ప్లే స్లిప్పులు ఇవ్వాలని, లేకపోతే ఉపాధి హామీ కూలీలందరినీ ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాశక్తి - పోలవరం**

మండల కేంద్రంలో స్థానిక గోదావరి వృద్ధాశ్రమంలో పోలవరం పంచాయతీ మాజీ ఉప సర్పంచి పంచాయతీ పాలకవర్గ సభ్యులు మంగినకొండ పోశీరత్నం దంపతులు గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగినకొండ మాట్లాడుతూ తన కుమారుడు మహేష్ వర్ధంతి, జయంతి రోజున ప్రతి ఏటా ఆయన అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. 40 మంది వృద్ధులకు ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

## అసంపూర్తిగానే మినీ ఇండోర్ స్టేడియం

### మాజీ మంత్రి పీతల సుజాత సెల్ఫీ ఛాలెంజ్

**ప్రజాశక్తి - చింతలపూడి**

పట్టణంలో మినీ ఇండోర్ స్టేడియం అసంపూర్తిగానే ఉందని టిడిపి మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఈ మేరకు ఆమె గురువారం సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018లో టిడిపి హయాంలో రూ.రెండు కోట్ల నిధులు మంజురు చేయించి మినీ ఇండోర్ స్టేడియం భవన నిర్మాణ పనులు వేగవంతగా చేశామని చెప్పారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా మినీ ఇండోర్ స్టేడియం నేటికీ అసంపూర్తిగానే ఉందన్నారు. బోయగూడెం-నామవరం రోడ్డుకు 2018లో చంద్రబాబు రూ.పది కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి నేటికీ రోడ్డు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బందెల ఆశీర్వాదం, వీరేంద్ర, మానేపల్లి రాజారావు, యేసు, వెంకన్న పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**ప్రజాశక్తి - పోలవరం**

తలలో కణుతులతో అనారోగ్యంతో బాధపడుతున్న బాలుని కుటుంబానికి ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు రూ.రెండు లక్షల సిఎం సహాయ నిధి చెక్కును గురువారం అందించారు. ఈ సందర్భంగా బాలుని తండ్రి బరినికాని సురేష్ మాట్లాడుతూ తలలో పలుచోట్ల భారీ కణుతులతో అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడు సోహన్ సాయిశ్వర్‌కి శస్త్రచికిత్స చేయడానికి రాష్ట్రంలో ఎన్నో వైద్యశాలలకు తిరిగామని చెప్పారు. శస్త్రచికిత్స కోసం రూ.25 లక్షలు ఖర్చు అవసరమవుతుందని వైద్యులు తెలిపారని, ప్రస్తుతం సిఎం సహాయ నిధి రూ.రెండు లక్షలు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.

## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

మండలంలోని దేవరగుంట, మెర్సపూడి, రేగుంట గ్రామాల్లో ఇటుకల తయారీ పరిశ్రమల్లో నివసిస్తున్న వలస కూలీల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు గురువారం పౌష్టికాహారం అందించారు. ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్‌వై.నూరాణి మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా అందించే పౌష్టికాహారం ఫ్యాక్టరీ యాజమాన్యం సహకారంతో, క్యారెట్, బీట్రూట్, పాలు, అరటి పండ్లు, రాగి జావా అందిస్తున్నట్లు తెలిపారు.

## హ్యూమన్ రైట్స్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గణేష్‌కుమార్

**ప్రజాశక్తి - మండవల్లి**

హ్యూమన్ రైట్స్ కైకలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా గుడివాడ విజయగణేష్‌కుమార్ నియమితులయ్యారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు మదిరే రంగసాయిరెడ్డి, ఉపాధ్యక్షులు సాయికుమార్, రాష్ట్ర న్యాయ విభాగం అధ్యక్షులు షేక్ ఖాజ మోయునుద్దిన్, రాష్ట్ర ఆర్‌టిఐ విభాగం అధ్యక్షులు సాంబెళ్ల సూర్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

## పిఎం జీవనజ్యోతి బీమాను వినియోగించుకోండి

**ప్రజాశక్తి - మండవల్లి**

ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం పేద ప్రజలకు ఆర్థిక భరోసాను కలిగిస్తుందని భైరవపట్నం సర్పంచి పొనుకుమాటి సామ్రాజ్యవాణి అన్నారు. భైరవపట్నంలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి తీరని లోటుతో పాటు ఆర్థికంగా ఎంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలు ఆ కుటుంబానికి ఎంతో ఆధారాన్ని అందిస్తాయన్నారు. అందుకే ప్రతిఒక్కరూ బీమా చేయించుకోవాలని ఆపద విపత్కర పరిస్థితుల్లో ఆ బీమా పథకాలు ఆదుకుంటాయని చెప్పారు. సంవత్సరానికి ఒక్కసారి రూ.456 చెల్లించి బీమాను పొందితే సహజంగా మరణిస్తే రూ.రెండు లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే మరో రూ.రెండు లక్షలు బీమా ద్వారా పొందవచ్చన్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఈ పథకాలపై అవగాహన లేకపోవడంతో వినియోగించుకోలేకపోతున్నారన్నారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపారు. అనంతరం శోభనాద్రిపురానికి చెందిన పెన్మత్స కృష్ణంరాజు బీమా యోజన పథకంలో చేరి రెండు వాయిదాలు చెల్లించి సహజంగా మరణించడంతో బీమా ద్వారా వచ్చిన రూ.రెండు లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించారు. మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునే విధంగా ఇన్సూరెన్స్ త్వరగా అందేలా కృషి చేస్తున్న ఎబిఎస్ పద్మకుమారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్‌ఎస్.భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు, ఎంపిటిసి సభ్యులు కిరీటి రాజు, గ్రామ ప్రముఖులు బి.రత్నకుమార్, బ్యాంకు మిత్ర జ్యోతి మేరీ, కార్యదర్శి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

## ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ విజయదుందుభి

**ప్రజాశక్తి - ఏలూరు**

ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ఎంపిసి, బైసిపి, ఎంఇసి విభాగాల్లో ఏలూరు టౌన్ ఫస్ట్ సాధించారని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల తులసీరామ్ మాట్లాడుతూ ఒత్తిడిలేని, క్రమశిక్షణతో కూడిన విషయ పరిజ్ఞానంతో భోదించటం ద్వారానే ఈ ఫలితాలు సాధించామని చెప్పారు. జూనియర్ ఎంపిసి విభాగంలో పి.ప్రీతమ్‌సాయి 465 మార్కులు, బైపిసిలో కె.హర్షసాయిప్రణవ్ 434, ఎంఇసిలో ఎం.గాయత్రి 485, సిఇసిలో జె.పద్మజ 475 మార్కులు, సీనియర్ ఎంపిసి విభాగంలో ఎ.సాయిహితేష్ 987 మార్కులు, బైపిసిలో యు.సాయిధనుష్ 986, ఎంఇసిలో ఎన్.విష్ణుప్రియ 979, సిఇసిలో మహమ్మద్ సమీర్ 955 మార్కులు సాధించారు. జూనియర్ ఉత్తీర్ణత 97.21 శాతం, సీనియర్ ఉత్తీర్ణత 98.36 శాతం సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ వి.కనకరత్నం, కళాశాల పరిపాలన అధికారి కె.మల్లికార్జునరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యావికాస్ విజయ కేతనం

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఇంటర్ ఫలితాల్లో స్థానిక విద్యావికాస్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని విద్యాసంస్థల డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్మీడియట్ సీనియర్ ఎంపిసి విభాగంలో కె.అంజన 986 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో 464 మార్కులు సాధించి ఎం.దివ్యశ్రీ, ఎం.స్నేహిత, ఎన్.నిహారిక, పి.సాత్విక విజయ కేతనం ఎగురవేశారాని తెలిపారు. మెట్టప్రాంతంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యా వికాస్ విద్యాసంస్థల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావికాస్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ప్రతిభ

**ప్రజాశక్తి - చింతలపూడి**

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జునియర్ కళాశాల విద్యార్థినులు 52 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ స్కైలాబ్ తెలిపారు. 111 మంది పరీక్షలకు హాజరు కాగా 65 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ పరీక్షలకు 90 మందికి 25 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. 20 ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. గ్లోరి జాస్మిన్ బైపిసి విభాగంలో 926, బి.శ్రావణి 924, పి.ఆశ్విత 896, బి.భువనేశ్వరి 896 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో వికాస్ హవా

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఇటీవల విడు దలైన ఇంటర్ ఫలితాల్లో స్థానిక వికాస్ విద్యాసంస్థలు విజయకేతనం ఎగురవేశాయని ఛైర్మన్ వి.జగన్ అన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వికాస్ కళాశాల ప్రాంగణంలో గురువారం అభినందించారు. వికాస్ జూనియర్ కాలేజీలో బైపిసి ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 987 మార్కులు సాధించిన సిహెచ్.తనుషా పట్టణంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కె.సాయిస్ఫూర్తి 463 మార్కులు సాధించిందన్నారు. పట్టణంలో మొదటి స్థానంలో వికాస్ విద్యాసంస్థలు నిలిచాయని తెలిపారు. 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సాయిస్ఫూర్తి, తనుషాలకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.కిషోర్, సిహెచ్.కిషోర్, లెక్చరర్లు చిట్టిబాబు, రమేష్ పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ సత్తా

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ఇంటర్ ఫలితాల్లో స్థానిక శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ బైపిసి విద్యార్థిని కె.శ్రీ హర్షిత 988 అత్యధిక మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందని ఎస్‌విఇఎస్ డైరెక్టర్ సింగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఎస్‌విఇఎస్ కళాశాల నుంచి ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు కానూరి నాగేశ్వరరావు జి.శ్రీధర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సుగుణ జూనియర్ కళాశాల విజయదుందుభి

**ప్రజాశక్తి - కలిదిండి**

స్థానిక శ్రీ సుగుణ జూనియర్ కళాశాల ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో విజయ ప్రభంజనం కొనసాగించినట్లు కళాశాల డైరెక్టర్ రాజమణి అన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపిసి విద్యార్థి స్నేహవర్షిణి 905, ఎన్ఎన్.సంధ్య 880, బైపిసి విద్యార్థి బి.మాధవి 889, ఎస్‌కె.అబిదున్నీసా 869 మార్కులతో ముందంజలో నిలిచారన్నారు. ప్రతమ సంవత్సర బైపిసి విద్యార్థి ఎన్‌వి.రాజేశ్వరి బోటనిలో 60, ఫిజిక్స్‌లో 60 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ప్రతి ఏటా శ్రీ సుగుణ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని డైరెక్టర్ రాజమణి తెలిపారు.

## ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి - కలిదిండి**

ఇంటర్ ఫలితాల్లో మండల స్థాయిలో స్థానిక అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారని ప్రిన్సిపల్ జి.త్రినాథ్ అన్నారు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఎంపిసి విద్యార్థి పాము గ్రీష్మ నాగ సాయి 933 మార్కులతో, ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో ఊసల దేవి 408 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, అధ్యాపక బృందానికి ప్రిన్సిపల్ జి.త్రినాథ్ అభినందలు తెలిపారు.

## ఆసైన్డ్ భూముల పరిశీలన

**ప్రజాశక్తి - ముసునూరు**

మండలంలోని పలు గ్రామాల్లో ఆసైన్డ్ భూములను నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను గుర్తించినట్లు చెప్పారు. చెక్కపల్లి, వేల్పుచర్ల, కాట్రేనిపాడు గ్రామాల్లో శ్మశాన భూములను కూడా పరిశీలించారు. ఆయనతో పాటు తహశీల్దార్ దాసరి సుధ, మండల సర్వేయర్ సురేష్ ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలపై బుర్రకథ ప్రదర్శన

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

ముదినేపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం వివిధ ప్రభుత్వ పథకాలపై కళాజాతర బృందం బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రెండోబజారులో నిర్వహించిన ఈ బుర్రకథలో జగనన్న సంక్షేమ కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రజలకు కలిగే నష్టాలు, పారిశుద్ధ్యం పాటించడం వల్ల ప్రజలకు కలిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపిటిసి సభ్యులు మరీదు నాగయ్య, జంపాన కోటయ్య, వైసిపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, వైసిపి నాయకులు ఉమా పాల్గొన్నారు.

## అల్లిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - కుక్కునూరు**

జాన్ వెస్లీ ఫౌండేషన్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గిరిజన గ్రామమైన అల్లిగూడెంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 130 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని జాన్ వెస్లీ ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ జాన్ వెస్లీ తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్యం అందుబాటులో లేని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించి అందరికి ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, లాజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెల్లదోమ నివారణపై అవగాహన

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

మండలంలోని తుక్కులూరు, జంగం గూడెం ఆర్‌బికెలో వివిధ పంటల్లో సరిపిల్ ఆకార తెల్ల దోమ నివారణ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారిని రాజులపూడి హేమ మాట్లాడుతూ తెల్ల దోమ నివారణలో పాటించాల్సిన ప్రామాణిక పద్ధతులను వివరించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో నాణ్యమైన దిగుబడులు సాధించి లాభాలు పొందాలన్నారు. రైతులకు ఏ విధమైన సహాయం కావాలన్నా 7995086890 సంప్రదించాలని తెలిపారు.

## టిడిపి కార్యాలయంలో శిక్షణ

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

నూజివీడు టిడిపి కార్యాలయంలో నూజివీడు రూరల్ మండలాలైన మర్రిబందం, మెర్సపూడి, గొల్లపల్లి, అన్నవరం, కొత్తూరు, హనుమంతులగూడెం మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ బూత్ ఇన్‌ఛార్జులు, కన్వీనర్లకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించిన పార్టీ నూజివీడు ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ వెరిఫికేషన్, హౌస్ మ్యాపింగ్ పలు అంశాలపై ఇంటిగ్రేటెడ్ శిక్షణ ఇచినట్లు తెలిపారు.

## 30 నుంచి చినవెంకన్న కళ్యాణ మహోత్సవాలు

### కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందించిన ఆలయ ఇఒ

**ప్రజాశక్తి - ఏలూరు**

ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి వారి వైశాఖమాస తిరుకళ్యాణం మహోత్సవాలకు విచ్చేయాలని సంయుక్త కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాధరావు గురువారం కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌ను ఆహ్వానించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ఛాంబర్‌లో ప్రసన్నవెంకటేష్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే ఏడో తేదీ వరకు స్వామివారి వైశాఖమాస తిరుకళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ తెలిపారు. స్వామివారి కళ్యాణం మే 4వ తేదీ రాత్రి 8.30 గంటలకు, మే 5వ తేదీ రాత్రి 7.30 గంటల నుంచి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు ఆలయ వేదపండితులతో వేద పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ ఇఒ

## సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

**ప్రజాశక్తి - మండవల్లి**

రహదారుల వెంబడి ఉన్న చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి ఎరువు తయారు చేసేలా కార్యదర్శులు కృషి చేయాలని ఇఒపిఆర్‌డి ఆనందబాబు సూచించారు. మండలంలోని అలీనగరం గ్రామాల్లోని సంపద కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు ఆదాయం సమకూర్చే విధంగా సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం గ్రామాల్లోని వీధుల వెంబడి ఉన్న చెత్తను పూర్తిస్థాయిలో సంపద కేంద్రానికి తరలించాలన్నారు. అప్పుడే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అంతేకాకుండా గ్రామానికి ఆదాయం సమకూరుతుందని ఆయన తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించుకుంటే వ్యాధులు కూడా దరిచేరవన్నారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించి ఎరువు తయారు చేయాలన్నారు. కార్యదర్శులు సహకరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలి

**ఏలూరు అర్బన్ :** విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనాలని సర్ సిఆర్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ అన్నారు. సిఆర్ రెడ్డి అటానమస్ కళాశాల రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో కళాశాలలోని ఆడియో విజువల్ హాలులో పోటీ పరీక్షల్లో సామాజికశాస్త్రాల ప్రాముఖ్యత అంశంపై గురువారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణుమోహన్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో సామాజికశాస్త్రాల ప్రాముఖ్యత గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ కెఎ.రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి జరిగే పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఉయ్యూరు ఎజి, ఎస్‌జి సిద్దార్ధ డిగ్రీ కళాశాల ఆచార్యులు సిహెచ్.సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.రాము, అర్ధశాస్త్ర విభాగాధిపతి ఆర్.కేశవ, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ బి.ఇమ్మానుయేలు, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నర్సరీల్లో మొక్కల పెరుగుదలకు కృషి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

నర్సరీల్లో మొక్కల పెరుగుదలకు కృషి చేయాలని జిల్లా అటవీ శాఖ అధికారి రవీంద్ర ధామ తెలిపారు. మండలంలోని జిల్లెళ్లగూడెంలో ఉన్న ఫారెస్ట్ నర్సరీని గురువారం పరిశీలించారు. నర్సరీలో ఉన్న పలు రకాల పండ్ల జాతుల మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్క దశలోనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే అవి పెరిగి మంచి పండ్లను ఇస్తాయన్నారు. ఎండాకాలంలో మొక్కలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు సబ్ డిఎఫ్ఒ సౌజన్య, రేంజ్ అధికారి శ్రీవాణి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దినేష్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**ప్రజాశక్తి - భీమడోలు**

ఇటీవల గుండుగొలనులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులుగా మిగిలిన కుటుంబాన్ని స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ ఆదుకుంది. గుండుగొలనులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాధితుడు జంగం దావీదు రాజు కుటుంబాన్ని గురువారం మానవత సభ్యులు పరామర్శించారు. అనంతరం వారికి సంస్థ తరపున రూ.2500 విలువైన నిత్యావసర వస్తువులు, భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ రూ.రెండు వేల విలువైన దుస్తులు, మానవత సంస్థ స్థానిక సభ్యులు పూడి శ్రీనివాసరావు రూ.వెయ్యి నగదు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, సమన్వయకర్త పంచకర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

**ముదినేపల్లి :** అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాల సభ్యులకు గురువారం వైసిపి తరపున ఆర్థిక సాయం అందించారు. మండలంలోని కొరగుంటపాలెం పంచాయతీ శివారు రాజనగరానికి చెందిన నాయుడు రామారావు, నాయుడు లక్ష్మీనారాయణలకు చెందిన రెండు పూరిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. ఈవిషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి బాధితులను పరామర్శించారు. అనంతరం రెండు కుటుంబాల సభ్యులకు రూ.25 వేల నగదు, నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామకృష్ణ, అల్లూరు గ్రామ సర్పంచి శీలం రామకృష్ణ, గ్రామ సొసైటీ ఛైర్మన్ అచ్యుత రాంబాబు, పార్టీ నాయకులు కె.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

## సొసైటీలో అప్పులపై సందేహాలుంటే తెలపండి

**ప్రజాశక్తి - టి.నరసాపురం**

స్థానిక సొసైటీలో అప్పులు తీసుకున్న వారు అనుమానాలుంటే 51 విచారణ పూర్తయ్యే లోపు ఫిర్యాదు చేయాలని విచారణ అధికారి అబ్దుల్ హాది గురువారం విలేకర్లకు తెలిపారు. స్థానిక సహకార సంఘంలో జరుగుతున్న 51 విచారణలో భాగంగా ఇప్పటికే అప్పుదారులందరికీ నోటీసులు పంపామని, ఎవరికైనా సందేహాలుంటే విచారణ అధికారిని కలిసి అప్పు నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు.

## ఫ్లెక్సీల తొలగింపు

**ముదినేపల్లి :** గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామ ప్రధాన కూడళ్లల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను గురువారం ముదినేపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫెక్సీలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటు కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పాడడంతో పాటు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు సందర్భాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇఒపిఆర్‌డి టివి.సారధి ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. ఫ్లెక్సీలు తొలగించాలని ముందస్తు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో పంచాయతీ వారు తొలగించారు.

**దస్తావేజు పోయినది**

ఏలూరు జిల్లా, టి.నరసాపురం మండలం, మక్కినవారిగూడెంకు చెందిన నా భార్య అయిన నాళ్ళ హిమబిందు, D/o. వెంకట నారాయణ, Doc. No. 5239/92, తేది. 11-8-1992 గా గల దస్తావేజును ది. 19-3-2023వ తేదీన మక్కినవారిగూడెం నుండి టి.నరసాపురం వెళుతూ వుండగా మార్గ మధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈక్రింది అడ్రసుకు సమాచారం ఇవ్వగలరు.

**సంకు వెంకట కేశవరావు**
S/o. సర్వేశ్వరావు
సమ్మెటవారిగూడెం, చింతలపూడి మండలం
సెల్: 9542377497

**మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారు, తాడేపల్లిగూడెం**
**ఐ.ఎ, నెం. 471/2023**
**అందున**
**ఒ.ఎస్. నెం. 237/2011**

మధ్య:
**వాది:** శ్రీ తమ్మినీడి ప్రసాదు
మరియు
**ప్రతివాదులు:** 1. శ్రీమతి తమ్మినీడి పద్మావతి
2. శ్రీ తమ్మినీడి సత్యన్నారాయణ
3. శ్రీ తమ్మినీడి వెంకటేశ్వరావు

**పబ్లిక్ నోటీసు (శ్రీ కోర్టు వారి ఆనతితో)**

యిందుమూలముగా పైన తెల్పిన మొదటి మరియు రెండవ ప్రతివాదులు/ రెస్పాండెంటులకు తెలియచేయునది ఏమనగా పైన తెల్పిన వాదిగారు అయిన ప్రసాదు గారు మీ పై దావా గ్రంధము పై నెంబరు కలది నెరపియుండగా మీరు అడ్వకేటు శ్రీ కొండేపాటి వెంకటేశ్వరరావు గారిని మీ తరపు వాదించుటకు వకీలుగా నియమితులను చేసియున్నారు. దావా గ్రంధము నడచుచుండగా మీ నుండి ఏవిధమైన స్పందన లేదని వారు మీ తరపు వాదించుటకు విముఖత చూపుచూ కోర్టునందు మీ నుండి ఏవిధమైన స్పందన లేదని కోర్టునకు విన్నవించుకొనియున్నారు.

కావున యిందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా సదరు దావా గ్రంధము వాయిదాను **03-05-2023**న కోర్టు వారు మీ స్పందన తెలుపుతూ మీరు ఖుద్దున గాని లేక విషయ పరిజ్ఞానం కలిగిన వకీలు ద్వారా గాని రాగలందులకు కోరియున్నారు. కావున పై తేదీన మీరు గాని లేక విషయ పరిజ్ఞానం కలిగిన వకీలు గారు ద్వారా వచ్చి మీరు వేయగల కాగితములను కోర్టున దాఖలు చేసుకొనగలరు. అటుల మీరు రాని పక్షాన మీ అభిముఖము లేకనే సదరు గ్రంధమును కోర్టు వారు సాగించెదరని యిందు మూలముగా తెలియచేయుచున్నాను.

**యాళ్ళబండి రామకృష్ణ పరమహంస**
అడ్వకేటు, తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం సెల్: 9948169761
తేది:26-4-23 6303018736

ప్రకటన
**మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి, ప॥గో॥జిల్లా, భీమవరం వారి కోర్టులో**
**O.S. No. 94/2022**

*Between:*
శ్రీమతి ఉద్దరాజు సీతారత్నం వగైరాలు **-వాదులు**
V/s
గాదిరాజు కన్యాకుమారి మరియు వగైరాలు **-ప్రతివాదులు**

***4వ ప్రతివాది:*** శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, W/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
***5వ ప్రతివాది:*** కూనపరాజు కౌశిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
***6వ ప్రతివాది:*** కూనపరాజు కార్తిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
*(5 మరియు 6వ ప్రతివాదులు మైనర్లు అయినందున వీరి తరపున సంరక్షకురాలు తల్లి 4వ ప్రతివాది)*

పై నెంబరు గ్రంథంలో 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్లకు అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ది. 15-06-2023వ తేదీకి వాయిదా అయివున్నది. కావున 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్లు **ది. 15-06-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** తమ అభ్యంతరములు స్వయంగా గాని, తమ అడ్వకేటు గారి ద్వారా గాని శ్రీయుత కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల సదరు గ్రంధమును 4వ ప్రతివాది అయిన శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి, 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్ల పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**అల్లూరి వెంకటేశ్వరరాజు**
అడ్వకేట్, భీమవరం
ప్రాంతం: భీమవరం వాదుల తరపు అడ్వకేట్
తేది:27-04-2023 సెల్: 9848211102